


## కేసీఆర్ సార్.. ధన్యం నీ జీవితం..

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ సార్.. ధన్యం నీ జీవితం..' అనే గేయాన్ని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఆవిష్కరించారు. కళాకారుడు, గాయకుడు ఈశ్వర్ రూపొందించిన పాట సీడీని శనివారం ఎర్రవెల్లిలోని నివాసంలో విడుదల చేశారు.

# జగ్జీవన్‌రామ్ సేవలు మహోన్నతం

- ఆయన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమసమాజం కోసం పాటుపడాలి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తేతెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత ఉప ప్రధానిగా, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన దార్శనికుడిగా జగ్జీవన్‌రామ్ సేవలు మహోన్నతమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని కేసీఆర్ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో సమసమాజం కోసం కృషి చేయడమే మనమందించే నివాళి అని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే సామాజిక వివక్షను ఎదుర్కొన్న ఆయన వర్ణ, కుల వివక్షకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేశారని శ్లాఘించారు. స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్న జగ్జీవన్‌రామ్.. తదనంతరం స్వయంపాలనలో కేబినెట్ మంత్రిగా కార్మిక శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. వ్యవసాయం, రక్షణ మంత్రిగా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. వివక్ష రహిత సమాజం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలను గుర్తించిన దేశ ప్రజలు ఆ మహనీయుడి జయంతిని సమతాదివస్‌గా జరుపుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన చేపట్టిన పోరాటాలు నేటికీ ఆదర్శనీయమని వెల్లడించారు.

### జగ్జీవన్‌రామ్ దార్శనికతే స్ఫూర్తి: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ దార్శనికత మనకు ఎంతో స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వంతో పాటు సాధికారత కోసం జగ్జీవన్‌రామ్ పోరాడారని గుర్తుచేసుకున్నారు.

### అలుపెరగని పోరు: హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని రస్కరించుకొని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం అట్టడుగు వర్గాల తరఫున జగ్జీవన్‌రామ్ అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు.

# మైనార్టీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

- వక్ఫ్ బిల్లుపై వెన్నుచూపిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ
- చర్చకు డుమ్మాకొట్టిన ఎంపీ ప్రియాంక గాంధీ
- మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీది ఒకటే స్టాండ్
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



యాదాద్రి భువనగిరి జిల్లా టేకులసోమారంలో ఎండిన వరిని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): దేశంలోని 30 కోట్ల మంది మైనార్టీలపై కాంగ్రెస్ కపట ప్రేమను చూపుతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో పాల్గొనకుండా ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెన్నుచూపి పారిపోవడం, ప్రియాంక గాంధీ డుమ్మాకొట్టడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం కవిత మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా మైనార్టీల హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లుపై రాహుల్ మాట్లాడకపోవడం, అత్యధికంగా మైనార్టీ ఓటర్లున్న నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రియాంక హాజరుకాకపోవడం దారుణమని అన్నారు. 'కాంగ్రెస్ నేతలకు ఎన్నికల టైంలోనే మైనార్టీలు గుర్తుకువస్తారు.. టోపీలు పెట్టుకొని ఓట్లడిగి గద్దెనెక్కిన తర్వాత నిండా ముంచుతారు..' అని నిప్పులు చెరిగారు. మైనార్టీల హక్కులను కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని ప్రగల్భాలు పలికే ఇద్దరు గాంధీలు వక్ఫ్ బిల్లుపై జరిగిన చర్చకు ఎందుకు డుమ్మాకొట్టారో దేశప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### బిల్లును బీఆర్ఎస్ వ్యతిరేకించింది..

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్‌ది మొదటి నుంచి ఒకే విధానమని కవిత స్పష్టం చేశారు. అందుకే పార్లమెంట్‌లో వారి తరఫున అనేకసార్లు గొంతెత్తామని గుర్తుచేశారు. గాంధీల మాదిరిగా తామెన్నడూ మైనార్టీలకు ద్రోహం చేయలేదని చెప్పారు.

### పూలే పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 8న తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద కవిత చేపట్టనున్న పూలే సాధన దీక్ష పోస్టర్‌ను కవిత ఆవిష్కరించారు. పీడిత, తాడిత వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్ఠించేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతున్నదో అర్థంకావడం లేదని అన్నారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న పూలే విగ్రహ సాధన దీక్షకు బీసీ బిడ్డలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్ వైఫల్యంతోనే వక్ఫ్ బిల్లుకు ఆమోదం

వలిగొండ: కాంగ్రెస్ వైఫల్యంతోనే బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిందని కవిత విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఏదుళ్లగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఎస్ఈ గూడూరు మోహన్‌రెడ్డి సంతాప సభలో శనివారం ఆమె పాల్గొన్నారు. వక్ఫ్ బిల్లుపై విలేకరులు ప్రశ్నించగా.. కాంగ్రెస్ పార్టీకి ముస్లిం మైనార్టీల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లు సందర్భంగా పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ నోరు మెదపలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ఈఈలు శ్యాంసుందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్తిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మ వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శాసనమండలి పక్ష నేత మధుసూదనాచారి, చిత్రంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజీవ్‌సాగర్, రాంచందర్‌నాయక్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

# జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

- పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేసిన యోధుడు
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- జగ్జీవన్ జాతి నాయకుడు కాదు..జాతీయ నాయకుడు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్
- తెలంగాణ భవన్‌లో ఘనంగా జయంత్యుత్సవాలు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తేతెలంగాణ): దివంగత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణభవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మధుసూదనాచారితో పాటు బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ పీడిత వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్పవ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. రక్షణ మంత్రిగా పాకిస్థాన్ కబంధ హస్తాల నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేయడంలో కీలకభూమిక పోషించారని ప్రశంసించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జాతి నేత కాదని, జాతీయ నేత అని అభివర్ణించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తుంగ బాలు, కిశోర్‌గౌడ్, కురువ విజయ్, చిరుమల్ల రాకేశ్ పాల్గొన్నారు.

### ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి, బడుగు బలహీనవర్గాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా బూచి... ఇరిగేషన్ శాఖ లూటీ

- నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్లకు డిమాండ్
- హైడ్రా వస్తదని బెదిరింపులు
- దళారుల సాయంతో దందా

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా సాగునీటిపారుదల శాఖ అధికారులకు కాసులు కురిపిస్తున్నది. అక్రమార్జనకు కొత్త మార్గాన్ని ఇది తెరలేపింది. చెరువులు, నాలాల సంరక్షణ సంగతేమో గానీ ఇరిగేషన్ శాఖ అధికారుల తీరుతో వాటి సమీపంలో ఇండ్లు కట్టుకున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. ఎన్వోసీ పేరిట అధికారులు కొత్త దందాలకు తెరతీసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. 1998 నుంచి 2011 వరకు భవన నిర్మాణ అనుమతుల నిబంధనల కోసం ఇచ్చిన 19 జీవోలను మేళవించి 2012 ఏప్రిల్ 7న జీవో నంబర్ 168ని అప్పటి సర్కారు జారీచేసింది. దాని ప్రకారం రిక్రియేషన్, గ్రీన్, బఫర్‌జోన్ల పరిధిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదు. 10 మీటర్ల విస్తీర్ణం వరకు ఉన్న కాల్వలు, వాగులు, నాలాలకు చుట్టూ రెండు మీటర్ల వరకు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోని కాల్వలు, వాగులు, నాలాలకు తొమ్మిది మీటర్ల వరకు, పది హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులు, ట్యాంకులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నుంచి 9 మీటర్ల వరకు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉంటే ఎఫ్‌టీఎల్ నుంచి గరిష్ఠంగా 30 మీటర్ల వరకు, గ్రామ పంచాయతీల పరిధిలో ఉండే నదులకు సంబంధిత శాఖలు నిర్ధారించిన హద్దుల నుంచి 100 మీటర్ల వరకు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో పారే నదులకు సంబంధిత శాఖలు నిర్ధారించిన హద్దుల నుంచి 50 మీటర్ల వరకు నిర్మాణ అనుమతులపై ఆంక్షలు ఉన్నాయి. ఈ మేరకు ప్లాట్ల యజమానులు, భూ యజమానులు నిర్మాణ అనుమతులు తీసుకుంటున్నారు.

### ఆ ఎన్వోసీల నిరాకరణ

ఇటీవల సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రా మాత్రం.. ఆ ఎన్వోసీలను తూచ్ అంటున్నది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి మళ్లీ ఎన్వోసీలు తీసుకురావాలని షరతులు విధిస్తున్నది. ఇదే అదనుగా ఇప్పుడు ఇరిగేషన్ శాఖ అధికారులు కాసులు పిండుకుంటున్నారు. ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో ఇండ్లు లేవని తెలిసి కూడా అధికారులు ఎన్వోసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. లేనిపోని కారణాలు చెప్పి డబ్బులు పిండుకుంటున్నారు. అడిగినంత ఇస్తే ఎన్వోసీ ఇస్తున్నారని, లేదంటే చుక్కలు చూపిస్తున్నారని చెబుతున్నారు. కింది నుంచి పైస్థాయి వరకు చేతులు తడపనిదే పని కావడం లేదని, అన్ని సక్రమంగా ఉన్నాయని చెబితే.. ఏదో ఒక లోపం తెరమీదికి తెచ్చి ఎన్వోసీ తిరస్కరిస్తున్నారని పేర్కొంటున్నారు. అంతేకాదు, సదరు దరఖాస్తుకు రిమార్క్ పెడతున్నారని, ఆన్‌లైన్‌లో, లేదా పాత మ్యాపులో సమస్య ఉందని సాకులు చెబుతున్నారని వాపోతున్నారు.



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం తోర్నాల వద్ద ఎండిన మోయతుమ్మెద వాగు



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం ధర్మారంలో ఎండిపోయిన దేవాదుల కాల్వ

# రిజర్వాయర్లున్నా నీళ్లు లేవు

- సాగునీరు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం
- వేలాది ఎకరాల్లో ఎండిన పంటలు సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంత రైతుల ఆందోళన

సిద్దిపేట, ఏప్రిల్ 5 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట జిల్లా జనగామ నియోజకవర్గంలోని చేర్యాల ప్రాంతంలో తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లు ఉన్నా నీళ్లు లేక వెలవెలబోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఈ రెండు రిజర్వాయర్లను నీటితో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్ల నుంచి నీళ్లందక చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు పక్క జిల్లాలోని బచ్చన్నపేట రైతులు ఆందోళన చెందుతున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో చుక్కనీరు లేక బోసిపోయింది.బీఆర్ఎస్ హయాంలో ఏటా పంపింగ్ చేసి చెరువులు, కుంటలు నింపి పంటలకు సాగు నీరు అందించారు. రంగనాయకసాగర్ నుంచి కొన్ని గ్రామాలకు సాగునీరు అందించేవారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎండిన చెరువులే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయలేదని, ఫలితంగా పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నామని రైతులు చెప్తున్నారు. మరికొందరు బావుల్లో పూడిక తీయిస్తుండగా, ఇంకొందరు కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. ఏం చేయలేని రైతులు ఎండిన పంట పొలాలను పశువుల మేతకు వదిలేస్తున్నారు.

### రైతులను ఎవలు పట్టించుకుంటలేదు..

నేను ఈ యాసంగిలో రెండెకరాల్లో మక్క వేసిన. పంట పూర్తిగా ఎండిపోయింది. నీళ్లు లేవనే వరి వేయలేదు. నిరుడు, ముందటేడు కూడా మక్క పంటనే వేసిన. అప్పుడు పంట మంచిగా పండింది. ఈ ఏడే గీ పరిస్థితి దాపురించింది. ఇంతముందెప్పుడు గిట్ల కరువు రాలే. అప్పుడు కేసీఆర్ సార్.. చెరువు, కుంటలను నింపిండు. రైతులను మంచిగ చూసుకునేది. ఇప్పుడు రైతులను ఎవలు పట్టించుకోవడం లేదు.

-ఇస్లావత్ బుజ్జి, మహిళా రైతు, హనుమతండా, ధూళిమిట్ట మండలం (సిద్దిపేట జిల్లా)

- ట్యాంకర్లతో చి'వరి' ప్రయత్నంగా..



వనపర్తి జిల్లా కందిరీగ తండాలో కొందరు రైతులు వరికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. చేతికి వచ్చిన చేలు కండ్ల ముందు ఎండిపోతుంటే.. చూడలేక ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి బతికించుకునేందుకు ఆరాట పడుతున్నారు. అయినా ఈ నీళ్లు సరిపోతలేవని ఆందోళన చెందుతున్నారు. మడిలో వదిలిన నీరు ముందుకు పోవడం లేదని వాపోతున్నారు. రోజు పది ట్యాంకర్లు మడిలో పోసినా ఒక్క మడి కూడా తడవడం లేదని గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. – వనపర్తి

- మూడెకరాలు ఎండింది..



నేను మూడు ఎకరాల్లో వరి సాగుచేసిన. పంట గొలక వేసే సమయంలో సాగునీరు అందక పూర్తిగా ఎండిపోయింది. పంట పూర్తిగా ఎండిపోయింది. మునుపెప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలే. గడ్డి మాత్రమే మిగిలింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
–మోహన్‌నాయక్, కాలేజీ తండా, ధర్పల్లి, నిజామాబాద్ జిల్లా

- నీళ్లులేక ఎండుముఖం



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం టంకర, దచ్చక్‌పల్లి, కొత్తపేట, సల్లోనిపల్లి గ్రామాల్లో టమాట, వంకాయ, చిక్కుడు, బీరకాయతోపాటు వివిధ రకాల ఆకుకూరలను రైతులు సాగు చేస్తుంటారు. అయితే నీళ్లు లేక చేతికొచ్చిన కూరగాయలు, పంటలు ఎండిపోతున్నాయి. హన్వాడలో యాదయ్యకు చెందిన టమాట, వంకాయ తోట ఎండిపోవడంతో చేసేదేమీ లేక మూగజీవాలను మేపుతున్నాడు. – హన్వాడ

- తడిలేక మిర్చి పంట ఎండిపాయే..



నేను 6.20 ఎకరాల్లో మిర్చి వేసిన. ఈ సారి భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో నీరు లేకుండా పోయింది. మిర్చి కాత దశకు వచ్చి తడి లేక ఎండిపోయింది. కొంత భాగం దిగుబడి వచ్చినా మార్కెట్‌లో మిర్చికి సరైన ధర లేదు. విత్తనాలు, ట్రాక్టర్ పనులు, కూలి పనులకు కలిపి రూ.14 లక్షల వరకు నష్టపోయిన. దీనికితోడు కాంగ్రెస్ సర్కార్ రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కూడా ఇవ్వలేదు. అప్పులు ఎలా తీర్చాలో తెలుస్తలేదు.
– ఎజాస్, దౌనెల్లి, కుంటా, నిర్మల్ జిల్లా